క్లుప్తంగా

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

టెక్కలి రూరల్: నందిగాం మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, కళాశాలలో మిగులుసీట్లు భర్తీకి నేరుగా ప్రవేశం కల్పించేందుకు దరఖాస్తులు కోరుతున్నామని గ్రేడ్-2 ప్రిన్సిపాల్ బి.మంజుల తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 5, 6, 7, 8, 9వ తరగతులతో పాటు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఎస్సీ కేటగిరీలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు నేరుగా తమను సంప్రదించి దరఖాస్తు అందజేయాలని సూచించారు.

ఆలయ ముఖద్వారం ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

మందస: మందస గ్రామ దేవత అన్నపూర్ణమ్మ తల్లి ఆలయ ముఖద్వారం నిర్మాణ పనులకు శాశనం వీధి జంక్షన్‌లో శుక్రవారం శంకుస్థాపన పూజలు చేశారు. ఇక్కడ ఉన్న ముఖద్వారాన్ని ఓ లారీ ఢీకొట్టడంతో ధ్వంసమైంది. దీంతో కమిటీ సభ్యులు కల్పించికొని నూతన ముఖద్వారానికి పూనుకున్నారు. పూజల్లో అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వసతి గృహం సందర్శన



మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మందస: జీఆర్‌పురంలోని బీసీ వసతి గృహాన్ని ఎంఈవో బి.సుందర్ సోలమన్ శుక్రవారం సందర్శించారు. నీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, హాస్టల్, వంట గదులను పరిశీలించారు. ఎనిమిది అదనపు టాయిలెట్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వార్డెన్ ఎస్.రామకృష్ణ, సిబ్బంది లోకేష్, ధనరాజ్ ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

టెక్కలి: టెక్కలి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువులు కొనుగోలు చేసుకున్న ప్రతీ రైతుకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మకాలు చేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో తహసీల్దార్ బి.సత్యం, వ్యవసాయ శాఖ ఏడీ కె.జగన్మోహన్‌రావు ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు మేలు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: తల్లిపాలు బిడ్డకు మేలు చేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.



మండపల్లి సంపద కేంద్రంలో ట్రై సైకిల్ దుస్థితి



ఈదుపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్త



సన్యాసిపుట్టుగ వద్ద సంపద కేంద్రం బయట పడేసిన చెత్త

సంపద లేని కేంద్రాలు!

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రాలు
- నిర్వహణపై దృష్టి సారించని అధికారులు

ఇచ్ఛాపురం రూరల్:

గ్రామాల్లో చెత్తా చెదారాన్ని సేకరించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరుగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉపయోగపడుతుందన్న లక్ష్యంతో ప్రతి పంచాయతీ కేంద్రంలో షెడ్లు నిర్మించారు. గత ఎన్నికల ప్రచార సమయంలో సంపద సృష్టిస్తామని పదే పదే చంద్రబాబు ప్రస్తావించారు. వేరే సంపద సంగతి అటుంచితే చెత్త నుంచి సంపద సృష్టించి కనీసం గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించలేదు.

కానరాని చెత్త శుద్ధి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 90కు పైగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 80 శాతం కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలపై అధికారులు దృష్టి సారించకపోవడంతో పాటు గ్రామాల్లో డ్రైనేజీల శుభ్రత, అనంతరం సేకరించిన చెత్తనంతా ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా పడేస్తున్నారు. దీంతో ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

నిర్వహణకు ప్రత్యేకంగా గ్రీన్ అంబాసిడార్లు

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణకు ప్రత్యేకంగా గ్రీన్ అంబాసిడార్లను నియమించారు. వారి ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి షెడ్లలో వేర్వేరుగా నిల్వ ఉంచేవారు. గ్రామాల్లో చెత్తను సేకరించడానికి ప్రత్యేకంగా ట్రైసైకిళ్లను కూడా అందించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో సంపద మాట అటుంచి, ఉన్న కేంద్రాలు, ట్రైసైకిళ్లు దాదాపు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పైగా కొన్ని ప్రాంతాల్లోని షెడ్లు మందుబాబులు, పేకాట రాయుళ్లు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునివ్వడానికి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను నిర్వర్తించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



వినియోగంలో లేని బాలకృష్ణాపురంలోని చెత్తలో సంపద కేంద్రం

పంచాయతీ అధికారులదే బాధ్యత



చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే. ఇటీవల కాలంలో నిర్వహణ లేకుండా నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. దీనిపై పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించాం. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చెత్తను సంపద కేంద్రాల్లో వేసేందుకు చర్యలు తీసుకొని వినియోగంలోకి తేవడం జరుగుతోంది.

– ఎల్.వెంకటరావు, డిప్యూటీ ఎంపీడీవో, ఇచ్ఛాపురం

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని.. దీనికి పంచాయతీ, వార్డు ఇన్‌చార్జిలు కీలకంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో మేజర్ పంచాయతీ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 వార్డులకు సంబంధించి పార్టీ ఇన్‌చార్జిలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయశాఖ పరంగా పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. రైతులకు సక్రమంగా విత్తనాలు, ఎరువులు, కనీసం సాగు నీరు కూడా ఇవ్వని మంత్రిగా అప్రతిష్ట మూటకట్టుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను పూర్తిగా గాలికొదిలేశారని గుర్తు చేశారు. ఇటువంటి వైఫల్యాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. పార్టీ బలోపేతానికి పంచాయతీ ఇన్‌చార్జిలు కీలకంగా వ్యవహరించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన ఇటీవల చేసిన కార్యక్రమాలతో వారికి ఎంతో భరోసా కలిగిందన్నారు. టెక్కలి పట్టణంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం, నాయకులు పి.రమణబాబు, వి.శ్రీధర్‌రెడ్డి, కె.అజయ్‌కుమార్, డి.పోలయ్య, కె.తిరుమల, ఎం. శివరావు, బి.కార్తీక్, శంకర్, శ్యామలరావు, ఎం.సన్యాశి, డి.రంగబాబు, తిరుపతి, గోపి, ఎం.కృష్ణ, కె.కనకరాజు, ఎస్.జగదీష్, ధర్మారావు, బి.రాజేష్, సీహెచ్.అప్పన్న, పినకాన వైకుంఠరావు, కర్నిక జీవన్, డి.నీలకంఠం పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



కంచిలి: బాబూజీ పాణిగ్రాహిని సన్మానిస్తున్న గ్రామస్తులు



కవిటి: బదిలీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కంచిలి: గోకర్ణపురంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసి బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన బాబూజీ పాణిగ్రాహిని స్థానిక సర్పంచ్ యారడి ఆనందరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. సీఆర్పీ యారడి దీనబంధు, స్థానికులు బేసి రమేష్, సీర చంద్రశేఖర్, సారి ఆనందరావు పాల్గొన్నారు.

కవిటి: కొండిపుట్టుగ పాఠశాలలో పనిచేసి బదిలీపై వారి సొంత మండలాలకు వెళ్లిన ఉపాధ్యాయులు అశోక్, రవిలను ప్రధానోపాధ్యాయులు నర్తు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 సనపల రామకృష్ణ, బెలగాం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈశ్వరరావు ఆచారి, సిలగాం ఫ్యానెల్ హెచ్‌ఎం శ్రీధర్, ఎస్‌ఎంసీ చైర్మన్ పుష్ప పాల్గొన్నారు.

వినతులు పెండింగ్ ఉండరాదు

- జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

కాశీబుగ్గ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన వినతులకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు సకాలంలో విచారణ చేసి పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

హుండీ ఆదాయం లెక్కింపు

కంచిలి : మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారి ఆలయం హుండీలో జూలై నెలలో భక్తులు వేసిన విరాళాలను ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం లెక్కించారు. నెల రోజులకు 49,682 రూపాయల ఆదాయం వచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన విద్య

టెక్కలి: టెక్కలి ఐసీడీఎస్ పీవోగా ఎస్.విద్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లాలో గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ప్రాజెక్టు అధికారిగా ఇక్కడకు వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేశారు.

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్, అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవోగా మామిడి రాజేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. నర్సీపట్నంలో ఇన్‌చార్జి సీడీపీఓగా, గ్రేడ్–1 సూపర్‌వైజర్‌గా పనిచేసిన ఆమె పదోన్నతిపై ఇచ్ఛాపురం వచ్చారు. గతంలో ఇచ్ఛాపురం సీడీపీవోగా విధులు నిర్వహించిన పురాణం నాగరాణి గార మండలానికి బదిలీపై వెళ్లిపోయారు. బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వరి మాట్లాడుతూ.. ఈ నెల ఏడో తేదీ వరకు ప్రాజెక్ట్ స్థాయిలో తల్లిపాల వారోత్సవాలను అన్ని కేంద్రాల్లో నిర్వహించేందుకు, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.



బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వరి

మందస: మందస సీడీపీవో పెద్దంటి అరుణ బాధ్యతలు స్వీకరించారు. కోమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించిన ఈమె పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వసుంధరదేవి సోంపేట బదిలీపై వెళ్లారు.



పెద్దంటి అరుణ

సక్రమంగా జీతాలు చెల్లించాలి

కాశీబుగ్గ: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా సక్రమంగా జీతాలు చెల్లించాలని, వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని పలాస డివిజన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి చాపర వేణు గోపాల్ డిమాండ్ చేశారు. స్థానికంగా శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో సూమారు 4,500 మంది రీడర్లుగా సుమారు 20 ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. వీళ్లందరికీ ఎస్క్రో అకౌంటు నుంచి జీతాలను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సంఘ అధ్యక్షులు బైపల్లి ఓంకార్, జిల్లా కార్యదర్శి దూగానా భాస్కరరావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మీటర్ రీడర్లు

మొక్కలు నాటివేత



మొక్కలు నాటుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: ప్రతీ ఒక్కరూ అమ్మ పేరున మొక్క నాటాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఎక్ పెడ్ మా కా నామ్ కార్యక్రమాన్ని కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు.

ఏడాది పాలన మోసాల మయం!

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనంతా మోసాలతోనే సాగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కార్యక్రమాన్ని టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి సర్కార్‌కు మధ్య తేడాను గమనించాలని విజ్ఞప్తి చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: కీర్తిపురంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న సమన్వయకర్త పిరియా విజయ, ఎంపీపీ బోర పుష్ప, పార్టీ మండల అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డి తదితరులు



సోంపేట: బుసాబద్రలో క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, నాయకులు



మందస: ములిపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న మండల పార్టీ అధ్యక్షులు దల్లీ జానకీరావు, సర్పంచ్ గుసిరి వెంకటరావు



వజ్రపుకొత్తూరు: గోవిందపురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, గొరకల విశ్వానాథం



కంచిలి: పెద్దకొజ్జిరియా గ్రామంలో క్యూఆర్ కోడ్ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి



టెక్కలి: తిర్లంగి పంచాయతీలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కోటబొమ్మాళి మండలం మాసాహెబ్‌పేటలో పార్టీ మండల అధ్యక్షుడు హేమసుందర్‌రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 5, 7 వార్డుల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పట్టణ పార్టీ నాయకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ



కంచిలి మండలం బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బయాలజీ, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయుడు ముప్పన ఈశ్వరరావు చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి నుంచే క్రమబద్ధంగా సిద్ధం కావాలని ఆకాంక్షిస్తూ ఉపాధ్యాయులు వీటిని ఉచితంగా అందజేశారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు రోజారాణి, ఇప్పలి ధర్మారావు, పి.కాంతారావు, నిరంజన్ ఖడంగా, పక్కి చంద్రశేఖర్ పట్నాయక్ పాల్గొన్నారు. –కంచిలి

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని మందస ఎస్సై కృష్ణ ప్రసాద్ అన్నారు. మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టిసారించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

–మందస

ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు



శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పట్టణంలోని సత్యసాయి మందిరంలో సామూహిక వ్రతాలు వైభవంగా జరిగాయి. సత్యసాయి సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 120 మంది మహిళలు ఏకరూప దుస్తులతో పూజలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

–ఇచ్ఛాపురం టౌన్